సాక్షి
పశ్చిమగోదావరి

గురువారం । 20 । ఏప్రిల్ । 2023



ముగిసిన ఫ్లెక్సీ వివాదం

ఇరగవరం మండలం తూర్పువిప్పర్రులో అంబేడ్కర్ ఫ్లెక్సీ చించివేత వివాదం ముగిసిందని డీఎస్పీ మనోహరాచారి తెలిపారు. 8లో



నిందితుల అరెస్ట్

ఆగిరిపల్లి మండలం కొమ్మూరులో ఓ వ్యక్తిని కొట్టి చంపిన కేసులో నిందితులను అరెస్ట్ చేసినట్టు డీఎస్పీ అశోక్‌కుమార్ గౌడ్ తెలిపారు. 8లో

వేసవిలో చల్లచల్లగా..

భానుడు భగభగమంటూ ప్రతాపాన్ని చూపుతున్నాడు. వేసవి తాపం నుంచి ఉపశమనం పొందేందుకు ప్రజలు పండ్ల రసాలు, పుచ్చకాయలు, తాటి ముంజులు, శీతల పానీయాల బాట పడుతున్నారు. 8లో





	ఇఫ్తార్ గురువారం సాయంత్రం	సహరి శుక్రవారం వేకువజాము
భీమవరం	6.27	4.21
తాడేపల్లిగూడెం	6.29	4.31
నరసాపురం	6.27	4.20

రంజాన్ వేళలు

పేదల బియ్యంపై ప్రత్యేక నిఘా

- అక్రమ రవాణాపై ఉక్కుపాదం
- ఉమ్మడి జిల్లాలో భారీగా కేసులు
- ఏడాదిలో 255 ప్రాంతాల్లో తనిఖీలు
- 153 కేసుల్లో 253 మంది అరెస్ట్

సాక్షి ప్రతినిధి, ఏలూరు: పేదలకు అందాల్సిన ఉచిత బియ్యాన్ని పక్కదారి పట్టిస్తున్న అక్రమార్కులపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు నిరంతరం తనిఖీలు చేసి పెద్ద ఎత్తున కేసులు నమోదు చేయడమే కాకుండా కొందరు స్మగ్లర్లపై బైండోవర్ కేసులు నమోదు చేశారు. తీరు మారకపోతే వారిపై రౌడీషీట్ పెట్టేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఏడాది వ్యవధిలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో విజిలెన్స్ అధికారులు 255 ప్రాంతాల్లో సోదాలు నిర్వహించి 153 కేసులు నమోదు చేసి 253 మందిని అరెస్టు చేశారు. గత ఐదేళ్లలో ఈ స్థాయిలో భారీగా కేసులు నమోదు కావడం ఇదే ప్రథమం.

జాతీయ రహదారిపై..

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టించి పోర్టు ద్వారా విదేశాలకు ఎగుమతులు చేసి స్థానికంగా అధిక ధరలకు విక్రయించే ముఠాలు ఎక్కువగా ఉన్నాయి. కాకినాడ పోర్టు ద్వారా రేషన్ బియ్యం ఎక్కువగా ఆఫ్రికా దేశాలకు ఎగుమతి అవుతోంది. ఇతర జిల్లాల నుంచి పోర్టులకు వెళ్లే వాహనాలు జిల్లాలోని రహదారి మీదుగా ప్రయాణించాల్సి ఉంది. ఈ క్రమంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు రేషన్ బియ్యంపై ప్రత్యేక దృష్టి సారించారు. వారానికి సగటున రెండు, మూడు కేసులు నమోదు చేసి నిందితులను అరెస్టు చేస్తున్నారు.



దెందులూరు మండలం జోగన్నపాలెంలో రేషన్ బియ్యాన్ని పట్టుకున్న విజిలెన్స్ అధికారులు

వందల కేసులు

ప్రధానంగా ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లోని నూజివీడు, దెందులూరు, ఏలూరు, భీమవరం, తణుకు, తాడేపల్లిగూడెం, ఉంగుటూరు ప్రాంతాల నుంచి అధికంగా రేషన్ బియ్యం పక్కదారి పడుతోంది. విజిలెన్స్ అధికారులు రేషన్ బియ్యం అక్రమ రవాణాపై 6ఏ కేసు నమోదు చేయడంతో పాటు నిరంతరంగా దాడులు కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో వందల కేసులు నమోదు చేశారు. దీంతో పాటు ఖరీఫ్, రబీ సీజన్ల ప్రారంభ సమయాల్లో ఎరువులు, పురుగు మందులు అధిక ధరలకు విక్రయిస్తున్న దుకాణదారులపై కూడా చర్యలు తీసుకుంటున్నారు. సీజన్ ప్రారంభంలో తనిఖీ చేసి ఎంఆర్‌పీ ఉల్లంఘన, రికార్డుల్లో స్టాకుకు గోడౌన్లల్లో ఉన్న నిల్వల తేడాలను సరిచూసి కేసులను నమోదు చేస్తున్నారు. ప్రధానంగా 33 ఫెర్టిలైజర్స్ షాపులపై కేసులు నమోదు చేసి 33 మంది యజమానులను అరెస్టు చేసి 105 టన్నుల ఫెర్టిలైజర్స్ నిల్వలను సీజ్ చేశారు. అలాగే ఫెర్టిసైడ్స్, సీడ్ విక్రయించే షాపులపై నాలుగు కేసులు నమోదు చేశారు.

253 మంది అరెస్టు.. 1,034 టన్నుల సీజ్

2022–23లో జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు రాష్ట్రంలో అత్యంత ప్రతిభ కనబరిచారు. ప్రధానంగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా 255 దాడులు నిర్వహించి 153 కేసులు నమోదు చేసి 253 మందిని అరెస్టు చేశారు. వీరిలో రెండు కంటే ఎక్కువ కేసులున్న 15 మందిపై బైండోవర్ కేసులను నమోదు చేసి, మళ్లీ అక్రమ రవాణాకు పాల్పడితే రౌడీషీట్ పెట్టేలా చర్యలు తీసుకున్నారు. అలాగే 86 వాహనాలను సీజ్ చేసి సుమారు 1,034 టన్నుల బియ్యం నిల్వలు స్వాధీనం చేసుకున్నారు. జాతీయ రహదారిపై ప్రత్యేకంగా విజిలెన్స్ బృందాలను ఏర్పాటు చేయడంతో పాటు ముందస్తు సమాచారంతో పెద్ద ఎత్తున నిల్వలను సీజ్ చేస్తున్నారు. బియ్యం అక్రమ రవాణాలో అక్రమార్కులతో పాటు కొందరి రేషన్ డీలర్ల పాత్ర కూడా ఉన్నట్టు గుర్తించారు.

30 క్వింటాళ్ల పట్టివేత

దెందులూరు: జోగన్నపాలెంలో కనకదుర్గమ్మ ఆలయ వంతెన సమీపంలో 30 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా బుధవారం ఏలూరు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు. పెదపాడు మండలం కొక్కిరపాడు నుంచి కాకినాడ పోర్టుకు అక్రమంగా పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్నట్టు గుర్తించారు. బియ్యాన్ని, వాహనాన్ని సీజ్ చేశారు. యజమాని మల్లవల్లి రాంబాబు, డ్రైవర్ శివ రంగారావుపై అధికారులు కేసు నమోదు చేశారు.

నిరంతర దాడులు



బియ్యం అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారించి నిరంతరం దాడులు చేస్తున్నాం. ప్రధానంగా కొన్ని ప్రాంతాలను గుర్తించి అక్కడ నిఘా బృందాల సమాచారంతో సోదాలు చేస్తున్నాం. పూర్తి ఘటనను వీడియో చిత్రీకరిస్తున్నాం. గతేడాదిలో 253 మందిని అరెస్టు చేయడంతో పాటు 15 మంది ప్రధాన అక్రమ వ్యాపారులను గుర్తించి బైండోవర్ కేసులు నమోదు చేశాం.

–కరణంకుమార్, విజిలెన్స్ ఎస్పీ, ఏలూరు

రంజాన్ ఆనందంగా జరుపుకోవాలి

మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



తణుకులో రంజాన్ కానుక అందిస్తున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

తణుకు అర్బన్: ముస్లింలు అత్యంత పవిత్రమైన రంజాన్ మాసంలో కఠిక ఉపవాస దీక్షలు చేస్తూ అల్లాహ్ కృపకు పాత్రులవుతారని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. రంజాన్‌ను పురస్కరించుకుని తణుకు నియోజకవర్గంలోని ముస్లింలకు మంత్రి కారుమూరి సొంత నిధులతో సమకూర్చిన రంజాన్ కానుక బ్యాగ్‌లను స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లింలు పండుగను ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ రంజాన్ కానుక అందించామన్నారు. నియోజకవర్గంలోని తణుకు, అత్తిలి, ఇరగవరం మండలాల్లో ముస్లింల ఇళ్ల వద్దకే వెళ్లి రంజాన్ కానుక పంపిణీ చేశారు. ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మెహర్ అన్సారీ, జిల్లా వైద్యవిభాగం అధ్యక్షుడు డాక్టర్ దాట్ల సుందరరామరాజు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, బోడపాటి వీర్రాజు, షేక్ బాజీ, షేక్ సలీం, అబ్దుల్ అన్సారీ పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

హాకీ ఎంపిక పోటీలు



ఎంపికైన క్రీడాకారులు

సాక్షి, భీమవరం: రాష్ట్రస్థాయి అంతర్ జిల్లాల పురుషుల హాకీ పోటీలకు జిల్లా జట్టును బుధవారం భీమవరం భారతీయ విద్యా భవన్స్ స్కూల్ ప్రాంగణంలో ఎంపిక చేసినట్టు హాకీ అసోసియేషన్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి అల్లు అప్పారావు తెలిపారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి 30 మంది క్రీడాకారులు రాగా 18 మందిని తుది జట్టుకు ఎంపిక చేశామన్నారు. వీరంతా ఈనెల 21 నుంచి నాలుగురోజుల పాటు సత్యసాయి జిల్లాలోని ధర్మవరం ప్రభుత్వ కళాశాలలో నిర్వహించే 13వ పురుషుల సీనియర్ హాకీ అంతర్ జిల్లాల పోటీలో పాల్గొంటారన్నారు. సీనియర్ క్రీడాకారులు కె.భరత్, సీహెచ్ అవినాష్ సెలెక్షన్స్‌కు సహకరించారన్నారు.

జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక



జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

ఏలూరు రూరల్: కృష్ణా జిల్లా మూలపాడులో ఈనెల 26 నుంచి జరుగనున్న అంతర్ జిల్లాల క్రికెట్ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జట్టును ఎంపిక చేసినట్టు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి వీవీఎస్ఎం శ్రీనివాసరాజు ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం ఆశ్రం వైద్య కళాశాల మైదానంలో అండర్–23 పురుషుల క్రికెట్ జట్టును ఎంపిక చేశామన్నారు. కేఎస్ఎన్ రాజు (కెప్టెన్), జట్టు సభ్యులుగా ఎస్.జగదీష్‌రామ్‌రెడ్డి, వి.జశ్విన్, కె.జాన్‌రిచర్డ్స్, జీఎస్ స్వామినాయుడు, ఎం.హర్షసాయిరెడ్డి, కేఎస్‌వీ తేజ, వి.లోహిత్, కె.రేవంత్‌నాగకుమార్, ఎం.రూపేష్, ఎం.హర్షవర్ధన్, జి.చరణ్‌సాయితేజ, బి.సాయి సుశాంత్, జి.రుత్విక్, పి.భువనేశ్వర్, స్టాండ్ బైగా బి.శివ, ఎండి మెహబూబ్‌ఆలీ, వీఎంవీఎస్ రక్షన్, పి.దీక్షిత్‌బాబు, డి.హర్షవర్ధన్, ఎం.రుత్విక్ ఎంపికయ్యారని తెలిపారు.

న్యాయమూర్తుల బదిలీలు

ఏలూరు (టూటౌన్): రాష్ట్రవ్యాప్తంగా పలువురు న్యాయమూర్తులను బదిలీలు చేస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా జడ్జీలుగా పదోన్నతులు కల్పించడంతో పాటు పలువురు జిల్లా జడ్జీలను బదిలీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఇదే క్రమంలో సీనియర్ సివిల్ జడ్జీలను బదిలీలు చేస్తూ బుధవారం హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఏలూరు ఒకటో అదనపు జిల్లా జడ్జి పి.మంగాకుమారిని రెండో అదనపు జిల్లా జడ్జి(కమ్ ఎల్‌ఆర్ ఏటీ ట్రిబ్యునల్ చైర్మన్) ఏలూరుకు బదిలీ చేశారు. గుంటూరు ఎస్సీ, ఎస్టీ కోర్టు జడ్జి జి.రామ్‌గోపాల్‌ను ఏలూరు ఒకటో అదనపు జిల్లా జడ్జిగా బదిలీ చేశారు. ఏలూరు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి డి.శ్రీనివాసులను అనంతపురం 8వ అదనపు డిస్ట్రిక్ జడ్జిగా నియమించారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిధిలోని కొవ్వూరు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కె.వెంకటేశ్వరరావును కాకినాడ రెండో అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జిగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో విజయవాడ చీఫ్ మెట్రోపాలిటన్ జడ్జిగా పనిచేస్తున్న డి.సత్యవతిని నియమించారు.

నేడు జలశక్తి బృందం పర్యటన

పోలవరం రూరల్: పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులను కేంద్ర జలశక్తి, పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) బృందం గురువారం పరిశీలించనుంది. అలాగే తూర్పుగోదావరి జిల్లాలో అంగుళూరు వద్ద నిర్మాణం జరుగుతున్న నేవిగేషన్ సిస్టమ్‌కు సంబంధించిన ఏర్పాట్లను కూడా పరిశీలిస్తారు. కేంద్ర జలశక్తి అండర్ సెక్రటరీ సతీష్‌కుమార్, అసిస్టెంట్ సెక్షన్ అధికారి రామన్ చంబర్, పోలవరం ప్రాజెక్టు అథారిటీ సీఈఓ శివనందన్ కుమార్, ఎం.రఘురామ్, పి.దేవేందర్ సభ్యులు పరిశీలించనున్నట్లు ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. అనంతరం ఇంజనీరింగ్ అధికారులతో పనులపై సమీక్షిస్తారన్నారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం సహించం

మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీ చరణ్



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో ముచ్చటిస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్

భీమవరం అర్బన్ : విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని, ప్రతిఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీ చరణ్ హెచ్చరించారు. మండలంలోని యనమదుర్రు, దెయ్యాలతిప్ప, కోమటితిప్ప నార్త్ గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను బుధవారం ఆమె తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో హాజరు పట్టీ, గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న పాలు, గుడ్లను పరిశీలించారు. సంపూర్ణ పోషణ ద్వారా నాణ్యమైన పౌష్టికాహారం అందిస్తున్నారా అని ఆరా తీశారు. చిన్నారులను ఆమె పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. వంట గదిలో విద్యార్థులకు వడ్డించే భోజన నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖకు పెద్దపీట వేస్తూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పిల్లల భవిష్యత్తే లక్ష్యంగా పథకాలు రూపొందిస్తున్నారన్నారు. గర్భిణులు, బాలింతలకు నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందిస్తున్నారన్నారు. అంగన్‌వాడీ సిబ్బంది బాధ్యతగా పనిచేస్తూ ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ సుజాతరాణి, సీడీపీఓ లక్ష్మీకాంతం, వాణి విజయరత్నం ఆమె వెంట ఉన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం ఇలవేల్పు మావుళ్లమ్మ, పంచారామక్షేత్రం గునుపూడిలోని ఉమా సోమేశ్వర జనార్దనస్వామి వార్ల ఆలయాలను మంత్రి ఉషశ్రీ చరణ్ సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మావుళ్లమ్మ ఆలయ పండితులు ఆమెకు వేద ఆశీర్వచనం అందించి అమ్మవారి ఫొటో, ప్రసాదాలను అందజేశారు. ఆలయ చైర్మన్ మానేపల్లి నాగేశ్వరరావు, ధర్మకర్తలు, పంచారామ క్షేత్ర ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షురాలు కోడే విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు

కలెక్టర్ ప్రశాంతి

తణుకు టౌన్ : ధాన్యం కొనుగోలులో రైతులకు ఎటువంటి ఇబ్బందులు ఎదురుకాకుండా సకాలంలో గోనె సంచులను అందజేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. బుధవారం తణుకు రూరల్ మండలంలోని వేల్పూరు–4 సచివాలయ పరిధి రైతు భరోసా కేంద్రం (ఆర్‌బీకే)లోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతులు ధాన్యాన్ని విక్రయించే ముందు ఆర్‌బీకే సిబ్బందికి తెలియజేయాలన్నారు. రైతులకు రవాణా, సంచులు, హమాలీల చార్జీలను చెల్లిస్తామన్నారు. అనంతరం అక్కడే ఉన్న రైతులతో ఆమె మాట్లాడారు. జిల్లా పౌర సరఫరాల జిల్లా మేనేజర్ టి.శివరామప్రసాద్, జిల్లా పౌర సరఫరాల అధికారి ఎస్.సరోజ, తహసీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్, ఏడీఏ ఎంవీ రమేష్ ఉన్నారు.

'ఫ్యామిలీ డాక్టర్'తో మెరుగైన సేవలు


విద్య, వైద్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని, పేదలకు మెరుగైన వైద్య సేవలను అందించేందుకు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని చేపట్టినట్టు కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. వేల్పూరు పీహెచ్‌సీ పరిధిలోని కొమరవరంలో ఫ్యామిలీ డాక్టర్ శిబిరాన్ని ఆమె తనిఖీ చేశారు. శిబిరాల ద్వారా వ్యాధులను గుర్తించడంతో పాటు వాటి నివారణకు మందులు అందిస్తారన్నారు. వైద్యులు ఇంటికే వెళ్లి వైద్యం అందిస్తారన్నారు. ప్రభుత్వం వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చి ప్రతి గ్రామంలో డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేసిందన్నారు. 104, 108 వాహనాలు, ఆరోగ్యశ్రీ సేవలను బలోపేతం చేయడంతోపాటు ఆరోగ్య ఆసరా కింద ఆర్థిక సాయం అందిస్తోందన్నారు. ఆయా కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందికి సూచించారు. డీఎంహెచ్‌ఓ డి.మహేశ్వరరావు, పీహెచ్‌సీ వైద్యులు టీఎల్ఎస్ హరిణి, కిషోర్ ఉన్నారు.



వేల్పూరులో ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

'పది' మూల్యాంకనం ప్రారంభం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): పదో తరగతి పరీక్షల జవాబుపత్రాల మూల్యాంకనం స్థానిక గ్జేవియర్ నగర్‌లోని సెయింట్ గ్జేవియర్ పాఠశాలలో బుధవారం ప్రారంభమైంది. ఏలూరు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్‌వీ రవిసాగర్ ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జవాబుపత్రాల మూల్యాంకనం కోసం ఆరుగురు అసిస్టెంట్ క్యాంపు అధికారులను, 300 మంది చీఫ్ ఎగ్జామినర్లను, 1,000 మంది అసిస్టెంట్ ఎగ్జామినర్లను, మరో 300 మంది స్పెషల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులను సబ్జెక్టుల వారీగా నియమించామన్నారు. ఏలూరు జిల్లాకు వివిధ జిల్లాల నుంచి 2,03,496 జవాబు పత్రాలను మూల్యాంకనం నిమిత్తం కేటాయించారన్నారు. మూల్యాంకన విధులకు నియమితులైన వారిలో సుమారు 10 మంది ఉపాధ్యాయులు బుధవారం గైర్హాజరయ్యారని వారికి షోకాజ్ నోటీసులు జారీ చేస్తున్నామని తెలిపారు.



ఏలూరులో ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న విద్యాశాఖ అధికారులు

నాటిక పోటీల విజేత 'నాన్నా నేనొచ్చేస్తా'

సాక్షి, భీమవరం: పట్టణంలో కళారంజని నాటక అకాడమీ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు నిర్వహించిన 12వ జాతీయస్థాయి నాటిక పోటీల్లో శ్రీఅమృత లహరి థియేటర్స్ (గుంటూరు) వారి 'నాన్నా నేనొచ్చేస్తా' ఉత్తమ ప్రదర్శనగా నిలిచింది. బుధవారం విజేతల వివరాలను అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు జవ్వాది దాశరథి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి మెంటే పూర్ణచంద్రరావు, కార్యనిర్వాహక అధ్యక్షుడు వై.వెంకటరమణ వెల్లడించారు. ద్వితీయ ఉత్తమ ప్రదర్శనగా గ్రామీణ కళాకారుల ఐక్యవేదిక (వెలిగండ్ల) వారి 'మృత్యుంజయుడు', తృతీయ ఉత్తమ ప్రదర్శనగా హర్ష క్రియేషన్స్ (విజయవాడ) వారి 'స్వర్ణకమలాలు', జ్యూరీ ప్రదర్శనగా హేలాపురి కల్చరల్ అసోసియేషన్ (ఏలూరు) వారి 'మనసున మనసై' బహుమతులు సాధించాయి. ఉత్తమ రచన తాళబత్తుల వెంకటేశ్వరరావు (నాన్నా నేనొచ్చేస్తా), ఉత్తమ దర్శకుడు అంచూరి నర్సిరెడ్డి (మృత్యుంజయుడు), ఉత్తమ నటుడిగా పి.విజయకుమార్ (మనసున మనసై), ఉత్తమ నటి ఎస్.అమృత వర్షిణి (నాన్నా నేనొచ్చేస్తా), ఉత్తమ సహాయ నటుడు రవికూటి శివప్రసాద్ (సూత్రం), ఉత్తమ హాస్యనటుడు కొల్లారి రాధాకృష్ణ (మనిషి మంచోడే), ఉత్తమ క్యారెక్టర్ నటుడు ఎ.నర్సిరెడ్డి (మృత్యుంజయుడు), ఉత్తమ క్యారెక్టర్ నటి వైకే భవానీ (మనసున మనసై) బహుమతులు అందుకున్నారు. ఉత్తమ రంగాలంకరణకు పి.సత్యం, ఏకే బాషా, ఉత్తమ ఆహార్యంగా మల్లేష్ బాలార్, ఉత్తమ సంగీతం సాయితేజ, ద్వితీయ ఉత్తమ నటుడు కె.శ్యామ్‌ప్రసాద్, ద్వితీయ ఉత్తమ నటి గుడివాడ లహరి, శీరం శ్రీనివాసరావు, పూజా ఠాకూర్ ఉత్తమ జ్యూరీ బహుమతులను గెలుచుకున్నారు. పోటీలకు గంటా రామ్మోహనరావు, చిట్టి వెంకటరావు, కత్తుల రామ్మోహనరావు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు.



విజేతలకు బహుమతులు అందిస్తున్న నిర్వాహకులు

సత్ఫలితం.. వర్కు బుక్ అభ్యాసం

- విద్యార్థి మేధస్సుకు పదును
- సులభంగా అర్థమవుతున్న పాఠాలు
- చదువుపై పెరుగుతున్న ఆసక్తి

ఆకివీడు: చిన్నారుల మేధస్సుకు పదును పెట్టేందుకు ప్రభుత్వం తీసుకువచ్చిన వర్కుబుక్ (పని పుస్తకం) విధానం సత్ఫలితాలనిస్తోంది. బోధనతో పాటు సాధన వర్కుబుక్ లక్ష్యం. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో పఠనాశక్తితో పాటు సృజనాత్మకను పెంపొందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఈ ఏడాది వర్కుబుక్ విధానాన్ని ప్రవేశపెట్టారు. 1 నుంచి 5వ తరగతి వరకు తెలుగు, ఇంగ్లిష్ పాఠ్యపుస్తకంతో పాటు ఒక వర్కుబుక్, అలాగే పర్యావరణ శాస్త్రం, గణితానికి సంబంధించి మూడు పాఠ్య పుస్తకాలు, మూడు వర్కుబుక్‌లు పంపిణీ చేశారు. ఒక్కో సెమిస్టర్‌కు ఒక్కో వర్కుబుక్‌ను కేటాయించారు. జిల్లాలో 1 నుంచి 5వ తరగతి వరకు విద్యార్థులు సుమారు 65 వేల మంది ఉండగా ఒకటి, రెండు తరగతి పిల్లలకు 1,25,000, 3,4,5 తరగతుల విద్యార్థులకు 3,20,000 వర్కుబుక్‌లు అందజేశారు. వీటి పనితీరుపై ఉపాధ్యాయులు, విద్యాశాఖ ఉన్నతాధికారులు నిరంతరం పర్యవేక్షణ జరపాల్సి ఉంది.

వర్కుబుక్ తీరిలా..

ఉపాధ్యాయుడు బోధించిన పాఠాల్లోని అంశాలను విద్యార్థులు వర్కుబుక్‌లో నింపాలి. అలాగే పాఠం అర్థమైన తీరును పని పుస్తకంలో రాస్తే ఉపాధ్యాయుడు పరిశీలించి సూచనలిస్తారు. ఈ విధానం ద్వారా విద్యార్థికి సులభంగా పాఠాలు అర్థమవడంతో పాటు వారి తార్కిక ఆలోచన, సృజనాత్మకత పెంపొందుతున్నాయి. దీని ద్వారా బట్టీ విధానానికి స్వస్తి చెప్పి నాణ్యమైన విద్యను పొందగలుగుతున్నారు. మానసిక వికాసం పెరగడంతో పాటు చదువుపై ఆసక్తి చూపుతున్నారు.



వర్కుబుక్‌తో సాధన చేయిస్తున్న ప్రధానోపాధ్యాయుడు

నిరంతర సాధన



చిన్నారుల మేధస్సుకు పదును పెట్టేలా వర్కుబుక్ ఉంది. నిరంతర సాధనతో విద్యార్థికి తెలివితేటలు పెరుగుతాయి. ఆలోచాన శక్తి, సృజనాత్మకత వృద్ధి చెందుతాయి. ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు కూడా వర్కుబుక్‌పై శ్రద్ధ చూపాలి.

– శ్రీనివాసుల పురుషోత్తం, ఉపాధ్యాయుడు, ఈస్టుపాలెం పాఠశాల, ఆకివీడు

బాగా చదువుతున్నారు



వర్కుబుక్‌తో పిల్లల్లో చదువుపై ఆసక్తి బాగా పెరిగింది. ఒకరికొకరు పోటీగా చదువుతున్నారు. వర్కుబుక్‌లో విద్యార్థులు ఆలోచించి రాసిన అంశాలే వారి తెలివితేటలకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. ఈ విధానం విద్యార్థులకు ఉపయుక్తంగా ఉంది.

– పున్నాని ధనలక్ష్మి, తల్లిదండ్రుల కమిటీ వైస్‌చైర్మన్, అజ్జమూరు

బాగా అర్థమవుతున్నాయి



ఉపాధ్యాయుడు చెప్పిన పాఠంలోని అంశాల్ని అర్థం చేసుకుని వర్కుబుక్‌లో రాసుకుంటున్నాం. దీనివల్ల పాఠం బాగా గుర్తుండిపోతుంది. బట్టీ పట్టే విధానం కంటే ఇది చాలా బాగుంది. ఆలోచనాశక్తి, చదువుపై ఆసక్తి కూడా పెరుగుతుంది.

–తాదేలు అభిరామ్, 4వ తరగతి, అజ్జమూరు

క్లుప్తంగా

యువతలో నైపుణ్యం పెంచేందుకు శిక్షణ

నూజివీడు/కైకలూరు/జంగారెడ్డిగూడెం: నిరుద్యోగ యువతలో నైపుణ్యాల్ని పెంపొందింపచేసి ఉపాధి కల్పించే నిమిత్తం ఏర్పాటు చేసిన నూజివీడు స్కిల్ హబ్ ద్వారా స్వల్పకాలిక కోర్సులకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఈ.తమ్మాజీరావు బుధవారం తెలిపారు. నూజివీడులో అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్, అసోసియేటివ్ డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులకు స్వల్పకాలిక శిక్షణనిచ్చి అనంతరం ఉపాధి కల్పించనున్నట్లు పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థుల నుంచి ఈనెల 21 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. ఇతర వివరాలకు స్కిల్ హబ్ కోఆర్డినేటర్ రామకృష్ణను 8374039719 నెంబర్‌కు ఫోన్ చేసి సంప్రదించాలని చెప్పారు. కైకలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సెల్ఫ్ ఎంప్లాయిడ్ టైలర్, అసోసియేటివ్ డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులకు శిక్షణ ఇస్తారన్నారు. వివరాలకు కైకలూరు స్కిల్ హబ్ కో–ఆర్డినేటర్ ప్రసాద్ 9701357315 నెంబరులో సంప్రదించాలని కోరారు. జంగారెడ్డిగూడెంలో అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్, అసోసియేటివ్ డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్, అసిస్టెంట్ సర్వేయర్ కోర్సులకు శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించేలా కార్యాచరణ రూపొందించినట్లు చెప్పారు. ఇతర వివరాలకు 9441751712/9110721092 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

వేసవి తాపం.. పానీయాలతో ఉపశమనం

- రోజురోజుకీ పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో సతమతం
- పుచ్చకాయ, లస్సీ, తాటి ముంజులు, కొబ్బరి నీటితో సేదతీరుతున్న ప్రజలు

బుట్టాయగూడెం: జిల్లాలో భానుడు భగభగమంటూ తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. గత కొద్దిరోజులుగా పలు ప్రాంతాల్లో సుమారు 45 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు తీవ్రమైన వేడిగాలులు వీస్తుండటంతో బయటకు రావాలంటేనే ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఎండ వేడిమి నుంచి కాపాడుకునేందుకు టోపీలు, ముఖానికి మాస్కులు ధరించడంతో పాటు చల్లదనం కోసం జ్యూస్‌లు, పుచ్చకాయలు, తాటి ముంజులు, కూల్ డ్రింక్స్ తాగుతూ ప్రజలు సేదతీరుతున్నారు. వేసవి తాపం పెరగడంతో వీటి అమ్మకాలు కూడా జోరందుకున్నాయి. వీటిలో పుచ్చకాయల విక్రయాలు అధికంగా ఉన్నాయి. వీటిలో షుగర్ బేబి, నాందేరి మధుబాల, ఆర్కేమెస్ అనే రకాలు ఉన్నప్పటికీ నాందేరి మధుబాల రకానికి ఎక్కువ డిమాండ్ ఉన్నట్లు వ్యాపారస్తులు చెబుతున్నారు. పుచ్చకాయ శరీరానికి చల్లదనాన్ని ఇవ్వడంతో పాటు ధర కూడా అందుబాటులో ఉండడంతో కాయలు తెచ్చుకుని ఇంటిల్లపాది తింటున్నారు. అలాగే లస్సీ, కొబ్బరి బొండాలకు కూడా గిరాకీ బాగా పెరిగింది. పెరుగు, పంచదార చిలికించి చేసే ఈ లస్సీ తాగడం వల్ల ఒంటికి చల్లదనం అంది రక్షణ లభిస్తుంది. నియోజకవర్గంలోని బుట్టాయగూడెం, పోలవరం, జీలుగుమిల్లి, కుక్కునూరు, వేలేరుపాడు, టి.నరసాపురం, కొయ్యలగూడెం మండలాలతో పాటు జిల్లాలోని పలు ప్రధాన రహదారుల్లో పుచ్చకాలు, పండ్ల రసాలు, కొబ్బరి బోండాల దుకాణాలు పెద్ద సంఖ్యలో వెలిశాయి. రోజురోజుకూ ఉష్ణాగ్రతలు పెరగడంతో వేసవి తాపం నుంచి కాపాడుకోవడం కోసం ప్రజలు ఈ చల్లని పానీయాలను తాగుతూ వడదెబ్బకు గురవకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.



పుచ్చకాయ



ఓ బండి వద్ద లస్సీ విక్రయాలు



తాటి ముంజులు

వడదెబ్బ లక్షణాలు

వేసవిలోనే తీవ్రమైన ఎండధాటికి వడదెబ్బకు గురయ్యే అవకాశాలు ఎక్కువ. ఈ క్రమంలో వడదెబ్బ లక్షణాలపై ప్రజలు పూర్తి అవగాహన పెంచుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. తలనొప్పి, తల తిరగడం, నాలుక ఎండిపోవడం/నోరు పిడచకట్టుకుపోవడం, జ్వరం, మగత కలవరింతలు, ఫిట్స్, పాక్షిక, పూర్తి అపస్మారక స్థితి లక్షణాలను వడదెబ్బ లక్షణాలుగా గుర్తించాలని వైద్యులు చెబుతున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఇవే

వడదెబ్బ నుంచి కాపాడుకోవడానికి తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.ఉపాధి కూలీలు 50 ఏళ్ల పైబడినవారు తప్పనిసరిగా ఓఆర్ఎస్ ప్యాకెట్‌లు అందుబాటులో ఉంచుకోవాలి. అలాగే రోడ్డు పక్కన చిరు వ్యాపారులు, ఎండలో ప్రయాణం చేసేవారు, గర్భిణులు, పాలిచ్చే తల్లులు, అప్పుడే పుట్టిన పిల్లల పట్ల అత్యధిక జాగ్రత్తలు తీసుకోవాలి. అలాగే బీపీ, సుగర్, గుండె జబ్బులు ఉన్నవారు కూడా అప్రమత్తంగా ఉండాలి. వీరి శరీరంలో ఎక్కువ వేడి ఉత్పత్తికావడం శరీరంలో ఎక్కువ ఉష్ణాన్ని కోల్పోవడం ద్వారా వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

రక్షణ చర్యలు తీసుకోవాలి



వేసవిలో ఎండ వేడిమి నుంచి రక్షణ కోసం జాగ్రత్తలు చాలా అవసరం. అత్యవసర పరిస్థితుల్లోనే బయటకు వెళ్లాలి. ఆ సమయంలో హెల్మెట్ లేదా టోపీ తలకు రక్షణగా ధరించాలి. అలాగే వేసవి తాపాన్ని తీర్చేందుకు మజ్జిగ, పుచ్చకాయ, కొబ్బరిబోండం తీసుకోవడం చాలా మంచిది. వడదెబ్బకు గురైతే తక్షణం వైద్యం అందించాలి.

– ఏఎస్‌వీ ప్రవీణ్, వైద్యాధికారి, దొరమామిడి పీహెచ్‌సీ, బుట్టాయగూడెం మండలం

షార్ట్ సర్క్యూట్‌తో కారు దగ్ధం



దోసపాడులో షార్ట్ సర్క్యూట్ వల్ల దగ్ధమైన కారు

దెందులూరు: మండలంలోని దోసపాడులో అత్తులూరి శ్రీనివాసరావు కారు షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. సమాచారం అందుకున్న భీమడోలు ఫైర్ ఆఫీసర్ నాగరాజు ఆధ్వర్యంలో సిబ్బంది వచ్చి మంటలు అదుపు చేశారు.

టైరు పేలి అదుపుతప్పిన బస్సు



ఉంగుటూరులో అదుపుతప్పిన ఆర్టీసీ బస్సు

ఉంగుటూరు: ఉంగుటూరు సమీపంలో కాకినాడ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ముందు టైరు పేలిపోవడంతో అదుపుతప్పి డివైడర్‌కు అవతలివైపుకు దూసుకుపోయింది. బుధవారం ఉదయం 9 గంటల సమయంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. అయితే ఆ సమయంలో అటువైపు ఏ వాహనాలు రాకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో సుమారు 30 మంది ప్రయాణికులు ఉన్నారు. వారికి ఎలాంటి గాయాలు కాలేదు.

జిల్లా వ్యాప్తంగా పోలీసుల దాడులు

సాక్షి, భీమవరం: జిల్లా వ్యాప్తంగా ఈ నెల 18న అసాంఘిక కార్యకలాపాలపై దాడులు నిర్వహించి కేసులు నమోదు చేసినట్లు ఎస్పీ యు.రవిప్రకాష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తణుకు పట్టణం పోలీసుస్టేషన్ పరిధిలో క్రికెట్ బెట్టింగ్ ఆడుతున్న వారిపై దాడిచేసి ఆరుగురిని అదుపులోనికి తీసుకుని వారి నుంచి రూ.12,500 నగదు రెండు సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్న 32 మందిపై కేసులు నమోదు చేశామన్నారు. గతంలో క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడి అరెస్ట్ అయిన వారు తిరిగి క్రికెట్ బెట్టింగ్ వంటి నేరాలు పాల్పడకుండా ముందు జాగ్రత్తగా 8 మందిని బైండోవర్ చేసినట్లు చెప్పారు.

బాధిత దళిత మహిళకు న్యాయం చేస్తాం

ఎస్సీ కమిషన్ మెంబర్ చెల్లెం ఆనందప్రకాష్ హామీ

పాలకొల్లు అర్బన్: అగ్రవర్ణాల దాడిలో గాయపడి వారం రోజుల నుంచి పాలకొల్లు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న దళిత మహిళ రొక్కాల మేరీని ఎస్సీ కమిషన్ మెంబర్ చెల్లెం ఆనందప్రకాష్ బుధవారం పరామర్శించారు. బాధిత మహిళ ఫిర్యాదులో ఎస్సీనని పేర్కొనకపోవడంతో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నమోదు చేయడంలో ఆలస్యమైందని పోలీసులు ఆనందప్రకాష్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రభుత్వాసుపత్రి నుంచి డీఎస్పీ మనోహరాచారితో ఫోన్లో మాట్లాడి హత్యాయత్నం కింద కేసు నమోదు చేయాలని సూచించారు. బాధిత మహిళలకు ప్రభుత్వం నుంచి ఎక్స్‌గ్రేషియా తక్షణం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో ఇలాంటి సంఘటనలు ఎక్కడ జరిగినా ఎస్సీ కమిషన్ సహించబోదన్నారు. కేసులో నిందితులను తక్షణం అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కేసును నీరుగార్చే ప్రయత్నం చేసిన పోలీసుల పాత్రపైనా విచారణ జరిపించి తప్పు చేసినట్లు రుజువైతే సంబంధిత అధికారులపైనా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బాధిత మహిళకు అండగా ఉంటాం

బాధిత మహిళకు మాలమహానాడు అండగా నిలుస్తుందని రాష్ట్ర అధ్యక్షుడు నల్లి రాజేష్ హామీ ఇచ్చారు. ప్రభుత్వాసుపత్రిలో మేరీని పరామర్శించి సంఘటన జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. నిందితులపై తక్షణ చర్యలు తీసుకోవాలని రాజేష్ డిమాండ్ చేశారు. ఇరువురు మహిళలు, ఒక యువకుడు దాడి చేశారని, వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధిత మహిళకు అండగా ఉంటామన్నారు. దళిత సంఘాల నాయకులు పసుపులేటి వీరాస్వామి, శెట్టిమి రాజు, బొండపల్లి గిరిజ, కొండేటి శివ, జేమ్స్, ఖండవల్లి వాసు, రామాంజుల పెదమధు, పసుపులేటి చినబాబు, సనమండ వీరాస్వామి, మాలమహానాడు నాయకులు పాలపర్తి కృపానాథ్, కొయ్యే లక్ష్మణరావు, బద్దా అంతర్వేది తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.



పాలకొల్లు ప్రభుత్వాసుపత్రిలో రొక్కాల మేరీని పరామర్శిస్తున్న ఎస్సీ కమిషన్ మెంబర్ చెల్లెం ఆనందప్రకాష్

హత్యాయత్నం కేసు నమోదు చేయాలి

దళిత మహిళపై దాడిచేసిన నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుతో పాటు హత్యాయత్నం కేసు నమోదు చేయాలని మాదిగ, ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్‌లు కొమ్మూరి కనకారావు, పెంద్ర వీరన్న డిమాండ్ చేశారు. పాలకొల్లు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న రొక్కాల మేరీని వారు బుధవారం పరామర్శించారు. ప్రాథమికంగా నిర్లక్ష్యంగా వ్యవహరించిన పోలీసుల పాత్రపై కూడా దర్యాప్తు చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డీజీపీకి వినతిపత్రం ఇచ్చామన్నారు.

హత్య కేసులో నిందితుల అరెస్టు

నూజివీడు: ఆగిరిపల్లి మండలం కొమ్మూరులో ఆరేపల్లి గాంధీ(50)ని కర్రలతో కొట్టి చంపిన నిందితులను అరెస్టు చేసినట్లు నూజివీడు డీఎస్పీ ఈడే అశోక్‌కుమార్ గౌడ్ బుధవారం తెలిపారు. స్థానిక రూరల్ సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో హత్యకు దారితీసిన వివరాలు వెల్లడించారు. కొమ్మూరుకు చెందిన ఆరేపల్లి గాంధీకి ఇద్దరు, కొడుకులు, ఇద్దరు కుమార్తెలు.. అతను గత మూడేళ్లుగా నిరంతరం మద్యం సేవించి కుటుంబ సభ్యులను ఇబ్బంది పెడుతున్నాడు. ఈ నేపథ్యంలో ఈనెల 17న ఉదయం గాంధీ ఇంటిలో ఉన్న కోడిని, సెల్‌ఫోన్‌ని తీసుకెళ్లి అమ్ముకొని డబ్బులతో తాగి వచ్చి తల్లితో, చిన్న కొడుకుతో గొడవ పడ్డాడు. దీంతో చిన్న కొడుకు ఆరేపల్లి అనిల్‌కుమార్, అతని మేనమామ వేముల శ్రీనివాసరావుతో కలిసి రాత్రి 9 గంటల సమయంలో గాంధీని ఇంటి ఎదురుగా ఉన్న కరెంట్ స్తంభానికి తాడుతో కట్టేసి అరవకుండా నోట్లో గుడ్డలు కుక్కి లావుపాటి కర్రలతో కొట్టారు. గాంధీ చనిపోవడంతో కట్లు విప్పి ఇంటి ఆవరణలో పడుకోపెట్టి ఆ తరువాత పరారయ్యారు. బుధవారం ఉదయం మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి నిందితుల కోసం గాలింపు చేపట్టారు. నూజివీడు వెళ్లేందుకు ఆగిరిపల్లి మండలంలోని వట్టిగుడిపాడు సెంటర్‌లో నిందితులు ఎదురు చూస్తుండగా అనిల్‌కుమార్, శ్రీనివాసరావును అదుపులోకి తీసుకున్నారు. ఇద్దరినీ రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించిన సీఐ రాజులపాటి అంకబాబు, ఆగిరిపల్లి ఎస్ఐ నంబూరి చంటిబాబులను డీఎస్పీ అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ అశోక్‌కుమార్ గౌడ్, పక్కన సీఐ, ఎస్సైలు

● గడపగడపకు సంక్షేమం



పాలకోడేరు: మండలంలోని కుముదవల్లిలో సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు

ప్రియుడి ఇంటి ముందు మౌనపోరాటం

మొగల్తూరు: పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసగించిన ప్రియుడి ఇంటి ముందు బాధిత యువతి బుధవారం మౌన పోరాటానికి దిగింది. బాధిత యువతి మాట్లాడుతూ శ్రీరాంపురం పంచాయతీ శివనారాయణపురానికి చెందిన కొండేటి సాయి తాను నాలుగు సంవత్సరాలుగా ప్రేమించుకుంటున్నామన్నారు. తనను వివాహం చేసుకోవాలని కోరగా తాను అగ్ర కులానికి చెందిన వాడినిని తమ ఇంట్లో పెళ్లికి అంగీకరించరని నిరాకరించాడని తెలిపింది. తనకు న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తానని తెలిపింది. ఆమె పోరాటానికి మాలమహానాడు అధ్యక్షుడు నల్లి రాజేష్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు తెన్నేటి కిశోర్‌లు మాట్లాడుతూ దళిత బిడ్డకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని, అవసరమైతే రాష్ట్ర వ్యాప్త ఉద్యమానికి పిలుపునిస్తామని హెచ్చరించారు. అయితే ఈ ఘటనపై రూరల్ సీఐ సురేష్ బాబు బుధవారం రాత్రి విలేకరుల సమావేశం ఏర్పాట్లు చేశారు. యువతి తమకు ఇంకా ఫిర్యాదు చేయలేదని, అన్యాయం జరిగినట్లు ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని తెలిపారు.



శివనారాయణపురంలోని ప్రియుడి ఇంటి ముందు మౌన పోరాటం చేస్తున్న యువతి

గంజాయి స్వాధీనం



ఆచంటలో అదుపులోకి తీసుకున్న నిందితులు

పెనుగొండ: ఆచంట మార్టేరు రహదారిలో నలుగురిని అదుపులోకి తీసుకొని, వారి నుంచి 5 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు పెనుగొండ సీఐ జీవీవీ నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం ఆచంట పోలీసుస్టేషన్ వద్ద విలేకర్లతో మాట్లాడుతూ పక్కా సమాచారం రావడంతో మంగళవారం సాయంత్రం ఆచంట తహసీల్దారుతో కలిసి ఎస్సై ఎం.రాజ్‌కుమార్ దాడి చేశారు. పాలకొల్లు ఎంబీరియన్ పేటకు చెందిన గుణ్ణం మణిరత్నం(22), ఖండవల్లి కౌశిక్ ఆనంద్(21), ఉండ్రాజవరపు సుధీర్ బాబు(20)లను ఆచంట మార్టేరు రహదారిలో నక్కల డ్రెయిన్ వద్ద అరెస్ట్ చేశారు. వారి వద్ద ఉన్న 15 సంవత్సరాల బాలుడిని సంరక్షణలోకి తీసుకున్నట్లు తెలిపారు.

ట్రాక్టర్ సీజ్

టి.నరసాపురం: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై కె.సతీష్‌కుమార్ తెలిపారు. మండలంలోని బొర్రంపాలెం గ్రామపంచాయతీ శివారు సూరంపూడి ఎర్రకాలువలో అక్రమంగా ఇసుక తరలిస్తున్నారన్న సమాచారంతో సిబ్బందితో దాడి చేసి ట్రాక్టర్‌ను సీజ్ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చేపల దొంగ అరెస్టు

తాడేపల్లిగూడెం రూరల్: పంచాయతీ చెరువులో చేపలను చోరీ చేస్తున్న వ్యక్తిని పట్టుకుని పోలీసులకు అప్పగించిన సంఘటన బుధవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించి రూరల్ ఎస్సై వీఎస్.వీరభద్రరావు తెలిపిన వివరాల ప్రకారం.. ఆరుగొలను గ్రామానికి చెందిన పంగిడి పోశియ్య స్థానికంగా ఉన్న 40 ఎకరాల విస్తీర్ణంలోని కోట్లమ్మ చెరువులో చేపలను వల వేసి పడుతుండగా చెరువు లీజుదారుడు పూడి సత్యనారాయణ (తాడేపల్లిగూడెం) పట్టుకుని రూరల్ పోలీసులకు అప్పగించారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు రూరల్ ఎస్సై వీఎస్.వీరభద్రరావు తెలిపారు.

ముగిసిన అంబేడ్కర్ ఫ్లెక్సీ వివాదం

ఇరగవరం: అంబేడ్కర్ ఫ్లెక్సీ చించివేత వివాదం ముగిసిందని నర్సాపురం డీఎస్పీ మనోహరాచారి అన్నారు. తూర్పు విప్పర్రు గ్రామంలో అంబేడ్కర్ ఫ్లెక్సీ చించివేత వివాదానికి సంబంధించి ఇరగవరం తహసీల్దారు కార్యాలయంలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ నెల 16వ తేదీ రాత్రి నుంచి జరిగిన సంఘటనలు వ్యక్తిగతంగా చూడాలన్నారు. అది వ్యక్తుల మధ్య జరిగిందే కానీ కులాల మధ్య కాదన్నారు. అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేసిన చోట ఎలాంటి అనుమతులు తీసుకోలేదని.. ఈ నేపథ్యంలో ఆ విగ్రహన్ని అక్కడ నుంచి తొలగించి స్కూల్‌లో పెట్టడానికి గ్రామంలో ఇరువర్గాల నుంచి 10 మందితో శాంతి కమిటీ ఏర్పాటు చేశామన్నారు. వారి ఒప్పందం మేరకు పంచాయతీ తీర్మానంతో పంచాయతీ వద్ద ఒక విగ్రహం, ఇప్పుడు ఏ విగ్రహం పెట్టారో ఆ విగ్రహన్ని అక్కడి నుంచి తొలగించి హైస్కూల్‌లో పెట్టాలని తీర్మానించారని చెప్పారు. దీనికి ఇరు వైపుల పెద్దలు అంగీకరించారన్నారు. ఫ్లెక్సీ చించివేత అనంతరం జరిగిన గొడవలు, సంఘటనల నేపథ్యంలో ఇరువర్గాలపై నాలుగు కేసులు నమోదు చేశామన్నారు. మరి కొన్ని రోజులు గ్రామంలో పోలీస్ పహారా కొనసాగుతుందన్నారు. ఎవరైన బయట వ్యక్తులు పరామర్శల పేరుతో గ్రామంలోకి వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. గ్రామాల్లో ఎవరైన ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే అనుమతులు తప్పనిసరి అన్నారు. ఎంపీడీఓ పి.శ్రీనివాస్ రావు మాట్లాడుతూ గ్రామాల్లో విగ్రహల ఏర్పాటుకు 2013లో జీవో విడుదలైందని దాని ప్రకారం సంబంధిత అధికారులు నుంచి తప్పకుండా అనుమతులు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో ఏర్పాటు చేసే ఫ్లెక్సీలపై ఎలాంటి రెచ్చగొట్టే వ్యాఖ్యలు రాయకుడదన్నారు. ఏ ఫ్లెక్సీలు పెడుతున్నారు అనేది ముందుగానే పంచాయితీ అధికారులకు ప్రూఫ్ ఇవ్వాలన్నారు. తణుకు రూరల్ సీఐ ఆంజనేయులు మాట్లాడుతు అంబేద్కర్ కొందరి వాడు కాదని అందరి వాడని చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఐ కె చంద్రశేఖర్, తహసీల్దార్ మాలతీ సిబ్బంది పాల్గొన్నారు.



ఇరగవరం తహసీల్దార్ కార్యాలయంలో మాట్లాడుతున్న డీఎస్పీ, అధికారులు

కులం పేరుతో దూషించారని ఫిర్యాదు

పాలకోడేరు: ఇంటి స్థలం కొనుగోలులో మధ్యవర్తిగా ఉన్న తనను కులం పేరుతో దూషించారని ఆరోపిస్తూ గొరగనమూడి గ్రామానికి చెందిన డి.ప్రవీణ్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పాలకోడేరు ఎస్సై నాళం శ్రీనివాసరావు తెలిపారు. గొరగనమూడి గ్రామానికి చెందిన ప్రవీణ్ కుమార్ తాను మధ్యవర్తిగా వ్యవహరించి అదే గ్రామానికి చెందిన బి.దుర్గకు స్థలం కొని పెట్టానని, అయితే సరిహద్దు గొడవలు వచ్చిన నేపథ్యంలో తన వల్లే నష్టపోయానంటూ కులం పేరుతో దూషించారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పాలకోడేరు ఎస్సై తెలిపారు

కడుపు నొప్పి తాళలేక యువకుడి ఆత్మహత్య



మృతుడు సొంగా శౌరి(ఫైల్)

ముసునూరు: తరచూ కడుపు నొప్పి వస్తుండడంతో తాళలేక అవివాహిత యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై ఎం.కుటుంబరావు తెలిపిన వివరాలు. మండలంలోని కాట్రేనిపాడు గ్రామానికి చెందిన సొంగా శౌరి(26) కూలి పనులకు వెళ్లేవాడు. తరచుగా కడుపు నొప్పి వేధించేది. ఈ నేపథ్యంలోనే బుధవారం పొలం వద్దకు వెళ్లిన తర్వాత కడుపు నొప్పి రావడంతో తాళలేక సమీపంలో ఉన్న పురుగు మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. బంధువులు చూసేటప్పటికే చనిపోయినట్లు గుర్తించారు. పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని నూజివీడు ఏరియా ఆస్పత్రికి తరలించి, పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు.

అప్పల బాధ తాళలేక వ్యక్తి ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న గణపతిరావు

ద్వారకాతిరుమల/పెదవేగి: అప్పులబాధ తాళలేక మండలంలోని మెట్టపంగిడిగూడెంకు చెందిన ఒక వ్యక్తి బుధవారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. మెట్టపంగిడిగూడెం గ్రామానికి చెందిన కట్టా గణపతిరావు(45) అప్పుల ఊబిలో కూరుకుపోయాడు. జీవితంపై విరక్తి చెంది పెదవేగి మండలం ధర్మాజీపేటలో కౌలుకు తీసుకున్న పొలంలో చెట్టుకు ఉరి వేసుకున్నాడు. చుట్టుపక్కల రైతులు హుటాహుటీన ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్టు ధృవీకరించారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

ముమ్మరంగా మాసూళ్లు

- పంట ఒబ్బిడిలో అన్నదాతలు బిజీ
- కూలీల కొరతతో ఇక్కట్లు
- నియోజకవర్గంలో 46వేల ఎకరాల్లో రబీ మాసూళ్లు



యంత్రంతో కోతలు కోసి ధాన్యం ట్రక్కులో నింపుతున్న దృశ్యం



ధాన్యం రాసులుగా పోసి ఆరబెడుతున్న దృశ్యం

పెంటపాడు: నియోజకవర్గంలో రబీ మాసూళ్ల జోరుగా సాగుతున్నాయి. మెట్టప్రాంతంలో మాసూళ్లు పూర్తి కాగా డెల్టాలో మాసూళ్ల పనులు జోరందుకున్నాయి. కూలీల కొరత తీవ్రంగా ఉండటంతో రైతులు యంత్రాలపై ఆధారపడుతున్నారు. దీంతో 50శాతం వరకు మాసూళ్లు పూర్తికావస్తున్నాయి. సమయం ఆదా అవుతోంది. ఏడాది గూడెం నియోజకవర్గంలో సుమారు 46 వేల ఎకరాల్లో వరిసాగు చేపట్టారు. అందులో పెంటపాడు మండలంలో 21.50 వేల ఎకరాలు, రూరల్ మండలంలో 25 వేలు ఎకరాల్లో సాగు చేస్తున్నారు. విత్తన పంటగా 1121 రకం సుమారు 2 శాతం ఎకరాల్లో సాగు చేశారు. ప్రభుత్వం క్వింటాకు రూ. 2200, 75 కేజీల బస్తా రూ.1530 చొప్పున మద్దతు ధర నిర్ణయించింది. ప్రస్తుత దిగుబడి కూడా ఆశాజనకంగా ఉంది. ఎకరాకు 45 నుంచి 60 బస్తాలకు పైగా దిగుబడి వస్తోంది.

యంత్రాలతో కోతలు:
రైతులు దాళ్వా కోతలకు యంత్రాలపై ఆధారపడుతున్నారు. మెషిన్‌లతో కోత కోస్తే నూర్పిడి అయిపోయి గింజలు చేతికి వచ్చేస్తున్నాయి. దీంతో పాటు, ఖర్చుకూడా తక్కువగా ఉండటంతో రైతులు వాటి వైపు మొగ్గు చూపుతున్నారు. గతంలో ఈ ప్రాంత రైతులు ఎక్కువగా కూలీలతోనే కోతలు కోయించేవారు. దాళ్వా వరి పంట ఒబ్బిడి చేసిన రైతులు అపరాల సాగుపై దృష్టి సారించాలని వ్యవసాయాధికారుల సూచిస్తున్నారు.

ముమ్మరంగా రబీ కోతలు:
మండలంలోని పలు ప్రాంతాల్లో రబీ వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. వేసవి ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పెరుగుతుండటంతో రబీ పంటలను త్వరగా ఒబ్బిడి చేసుకొనేందుకు రైతులు ప్రయత్నిస్తున్నారు. వాతావరణం అనుకూలించడంతో వరిసాగు ఈ ఏడాది సజావుగా సాగింది. ఈనిక దశలో కూడా తెగుళ్ల ప్రభావం అంతగా లేదు. ధాన్యం ఎగరబోత కుప్పనూర్పు, వంటివి అవసరం లేకుండా ఎప్పటికప్పుడు కోత కోసిన ధాన్యాన్ని గట్టుపైకి తీసుకొచ్చే పనిలో రైతులు బిజీగా ఉన్నారు. దీంతో ఖర్చు కూడా గణనీయంగా తగ్గుతోంది. దీంతో వాతావరణం పరిస్థితుల దృష్ట్యా ఎప్పటికప్పుడు పంట ఒబ్బిడి అవుతోంది. యంత్రాలకు కూడా గిరాకి ఏర్పడింది. సాగు చేసిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు రైతు భరోసా కేంద్రాల ద్వారా అన్ని ఏర్పాట్లు చేశామని ఏవో పార్థసారధి తెలిపారు.

అపరాల సాగు చేపట్టాలి



వరి కోతల అనంతరం తేమపోకుండా రైతులు అపరాల సాగును చేపట్టాలి. ఈ సాగుతో రైతులకు మేలు జరుగుతుంది. ప్రస్తుతం ఆర్బీకేలో అపరాల విత్తనాలు అందుబాటులో ఉన్నాయి.

– కె. పార్థసారథి, మండల వ్యవసాయాధికారి, పెంటపాడు

బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతి సర్దార్ గౌతు లచ్చన్న



గౌతు లచ్చన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లులర్పిస్తున్న బీసీ సంక్షేమ సంఘ నాయకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతి సర్దార్ గౌతు లచ్చన్న అని పలువురు నాయకులు కొనియాడారు. గౌతు లచ్చన్న వర్ధంతి సందర్భంగా బుధవారం స్థానిక బీసీ సంక్షేమ సంఘ కార్యాలయంలో నియోజకవర్గ యువజన ప్రధాన కార్యదర్శి తుమరాడ చిన్న ఆధ్వర్యంలో బీసీ సంక్షేమ సంఘం తరుపున లచ్చన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు వర్తనపల్లి కాశీ, నియోజకవర్గ అధ్యక్షుడు కేశవభట్ల విజయ్‌లు మాట్లాడుతూ గౌతు లచ్చన్న ఎన్నో ఉద్యమాల్లో పాల్గొని బీసీల కోసం ఎన్నో పోరాటాలు చేసిన మహానీయుడు అని కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అత్తిలి బాబి, మారిశెట్టి నరసింహమూర్తి, పెద్దిరెడ్ల రమేష్, సతీష్, పండు, బీసీ నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ముస్లిం కుటుంబాలకు రంజాన్ కానుకల పంపిణీ



పైడిపర్రులో ముస్లిం కుటుంబాలకు రంజాన్ కానుకలు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

తణుకు టౌన్: రంజాన్ సందర్భంగా రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు సొంత నిధులతో ఏర్పాటు చేసిన రంజాన్ కానుకలను తణుకు పైడిపర్రులోని 33 వార్డులోని ముస్లిం కుటుంబాలకు బుధవారం వైఎస్సార్‌సీపీ నాయకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ జేసీఎస్ కన్వీనర్, వార్డు ఇన్‌చార్జి ఇండుగపల్లి బలరామకృష్ణ, నాయకులు ములగాల శ్రీనివాసు, కొత్తపల్లి చరణ్, కే విశ్వేశ్వరరావు, కొమ్మిరెడ్డి సాయి, గృహ సారథులు, నాయకులు పాల్గొన్నారు.

శాశ్వత భూహక్కు ఎంతో ఉపయోగం



పెంటపాడులో డ్రోన్ పనితీరును పరిశీలిస్తున్న పార్టీ నాయకులు, తదితరులు

పెంటపాడు: జగనన్న శాశ్వత భూహక్కు–భూరక్ష పథకం రైతులకు ఎంతో ఉపయోగమని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి నల్లమిల్లి విజయానందరెడ్డి పేర్కొన్నారు. జగనన్నభూహక్కు– భూరక్ష పథకంలో భాగంగా పెంటపాడు నుంచి దర్శిపర్రు గ్రామాల్లో సర్వే చేసేందుకు గాను ప్రభుత్వం ఏర్పాటు చేసిన డ్రోన్ వినియోగాన్ని బుధవారం ఆయన పార్టీ ఎంపీటీసీ సభ్యులు రెడ్డి సూరిబాబుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ జీవీ శేషగిరిరావు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో 898.43 ఎకరాలకు గానూ ప్రభుత్వ భూమి 189.80 ఎకరాలు, జీరాయితీ భూమి 708.63 ఎకరాలు ఉన్నాయన్నారు. ఈ పథకం కమతాలను నమోదు చేసేందుకు ఎంతో ఉపయోగమన్నారు. భూహక్కు పత్రాలకు ఇచ్చేందుకు, రైతులు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయకుండా ఉండేందుకు గాను ఈ సర్వేను ప్రభుత్వం చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ దీప్తి, వీఆర్వోలు, డ్రోన్ సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే సంక్షేమ పాలన



తిరుపతిపురంలో సచివాలయ కన్వీనర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

అత్తిలి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రంలో సంక్షేమ పాలన సాధ్యమవుతుందని ఎంపీపీ మక్కా సూర్యనారాయణ చెప్పారు. బుధవారం తిరుపతిపురం గ్రామంలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లతో ఎంపీపీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మక్కా సూర్యనారాయణ మాట్లాడుతూ గ్రామంలో ఏ ఇంటికి వెళ్లినా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందినందుకు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారన్నారు. గ్రామంలో వంతెన రోడ్డు, ప్రహరీగోడ నిర్మించేందుకు మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అధికారులను పంపారని చెప్పారు. అంచనాలు తయారైన వెంటనే పనులు చేపడతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పంపన బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని హౌసింగ్‌బోర్డు 33/11కేవీ సబ్ స్టేషన్ పరిధిలో రిలయన్స్ ఫీడర్ మరమ్మతులు నిమిత్తం ఈ నెల 20వ తేదీన ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీ ఈపీడీసీఎల్ తాడేపల్లిగూడెం డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.వెంకటేశ్వరరావు వెల్లడించారు. ఏరియా ఆసుపత్రి, చెట్లు రోడ్డు, పరిసర ప్రాంతాలలో విద్యుత్ ఉండదని, విద్యుత్ వినియోగాదారులు సహకరించాలని కోరారు.

వైభవంగా వెంకన్న బ్రహ్మోత్సవాలు

భీమవరం (ప్రకాశంచౌక్): హౌసింగ్ బోర్డు కాలనీలోని పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి మందిరం 12వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం కటారి సుబ్బరాజు– సుబ్బలక్ష్మి దంపతులతో ధ్వజారోహణం, చక్రస్నానం జరిపారు. రాత్రి 7గంటలకు గాదిరాజు శ్రీహరిరాజు– లావణ్య దంపతులతో పుష్పోత్సవం, ఊంజల్ సేవ జరిపించారు. అధ్యక్ష, కార్యదర్శులు కంతేటి వెంకటరాజు, కుక్కల బాలవెంకతరత్నం,సభ్యులు సరిపిడకల రామారావు, ఏర్పాట్లు పర్యవేక్షించారు.

జన సంక్షేమమే జగనన్న ఆకాంక్ష

ప్రభుత్వ పథకాల పై సంతృప్తి



మాధవరం, కొమ్ముగూడెం గ్రామాల్లో జగనన్న మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహిస్తున్న నాయకులు



31వ వార్డు శీలి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రభుత్వ పథకాలను ప్రచారం చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: ప్రభుత్వ పథకాల పట్ల ప్రజలు సంతృప్తికరంగా ఉన్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికారి ముప్పిడి సంపత్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని జగన్నాథపురం, చినతాడేపల్లి, కొత్తూరు, నవాబుపాలెం,కొమ్ముగూడెం, మాధవరం తదితర గ్రామాల్లో జగనన్న మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. జగన్నాథపురంలో సర్పంచ్ ఉండ్రాజవరపు చంద్రిక, వైఎస్సార్‌సీపీ నాయకుడు ముప్పిడి సంపత్‌కుమార్, చినతాడేపల్లిలో సర్పంచ్ పిచ్చికల రాజారావు, కొమ్ముగూడెంలో వెలిశెట్టి నరేంద్రకుమార్, మాధవరంలో తమ్మిశెట్టి చుక్కయ్య, అప్పారావుపేటలో మార్లపూడి సుబ్బారావు, అడపా హరిబాబు, వెంకట్రావుపాలెంలో ఎలిపే గాంధీ, కొత్తూరులో తిరుమల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జగనన్న మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చినతాడేపల్లి ఉపసర్పంచ్ చిట్టూరి కాశీవిశ్వనాథం, మద్దుకూరి మెహెర్‌ప్రసాద్, కోనేటి దానయ్య తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం అర్బన్: మా భవిష్యత్తు జగన్, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం పట్టణంలోని అన్ని వార్డుల్లో ఉత్సాహంగా కొనసాగుతోంది. ఈనెల 21వ తేదీతో ఈ కార్యక్రమం ముగుస్తుండటంతో గృహసారథులు, వలంటీర్లు , వార్డు ఇన్‌ఛార్జిలు ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలకు అందిన సంక్షేమ పథకాల లబ్ధి వివరాలను సేకరిస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించాలని ప్రజలను కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో మారిశెట్టి రమణ, శీలి వెంకటేశ్వరరావు, రాజా త్రినాథ్, అన్నివార్డు ఇన్‌చార్జిలు వలంటీర్లు, గృహసారథులు తదితరులు పాల్గొన్నారు.

21న గూడెంలో వామపక్షాల బహిరంగ సభ



తణుకులో మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు భీమారావు

తణుకు: కార్మికులకు వ్యతిరేకంగా తెచ్చిన 4 లేబర్ కోడ్‌లు రద్దు చేసి కార్మిక చట్టాలను యథాతథంగా అమలు చేయాలని కోరుతూ మే 1న అంతర్జాతీయ కార్మిక దినోత్సవం మేడే ఘనంగా నిర్వహించుకోవాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు భీమారావు తెలిపారు. బుధవారం అక్కమాంబ టెక్స్‌టైల్స్ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశానికి అధ్యక్షత వహించి మాట్లాడారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 21న వామపక్షాలు ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెంలో జరగనున్న బహిరంగ సభలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. దేశాన్ని కాపాడుకుందాం అంటూ సీపీఐ, సీపీఎం దేశవ్యాప్తంగా చేపట్టిన ప్రచారభేరికు మద్దతుగా నిలవాలని భీమారావు కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి తుమ్మలపల్లి శ్రీనివాస్, కోశాధికారి వై.నాగశివశంకర్, ఉపాధ్యక్షులు అనంత విక్రమరావు, పుచ్చకాయల భాస్కరరావు, దేవ పెద్దిరాజు, దంపబోయిన శ్రీనివాస్, గుల్లపల్లి కనకారావు, అయిశెట్టి కిశోర్, పితాని దుర్గారావు, ఎ.గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

భాజపా పాలనకు చరమగీతం పాడాలి



ప్రత్తిపాడులో సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో నిరసన చేస్తున్న నాయకులు



తాడేపల్లిగూడెం మండలంలో వామపక్షాల ప్రచార భేరి యాత్ర నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): దేశాన్ని అధోగతిపాలు చేసిన భాజపాకు వచ్చే ఎన్నికల్లో ప్రజలు చరమగీతం పాడాలని సీపీఎం, సీపీఐ నాయకులు, కార్మికులు పిలుపునిచ్చారు. పట్టణంలో ఆరోవ రోజు బుధవారం ప్రచారభేరి కార్యక్రమం ప్రత్తిపాడు గ్రామంలో నిర్వహించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశంలో అనుసరిస్తున్న విధానాలను ఎండగట్టారు. ప్రజలు బీజేపీ ప్రభుత్వానికి బుద్ధి చెపేందుకు ప్రజలందురు ఒకే తాటి పైకి రావాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కర్రి నాగేశ్వరరావు, మండల నాగేశ్వరరావు, కరెడ్ల రామకృష్ణ, కాసాని శ్రీను, శిద్ధిరెడ్డి శేషబాబు, పోతు శ్రీను, అల్లం రాము. దాస్యం రాము, బాబీ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో వామపక్షాల ప్రచార భేరీ యాత్ర
తాడేపల్లిగూడెం రూరల్: సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో మండలంలోని ఉప్పరగూడెం, జగన్నాథపురం, మాధవరం, అప్పారావుపేట, గొల్లగూడెం గ్రామాల్లో బుధవారం ప్రచార భేరీ యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు కండెల్లి సోమరాజు, సీపీఐ నాయకుడు ఉల్లింకల జయకృష్ణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సాగిస్తున్న నిరంకుశ దాడులకు ప్రజాస్వామ్యంపై జరుగుతున్న దాడులను ఖండించాలన్నారు. ఈ నెల 21వ తేదిన జరిగే ప్రచార భేరి యాత్ర ముగింపు సభ తాడేపల్లిగూడెం ఎన్‌ఆ గ్రౌండ్‌లో జరుగుతుందని, ఈ సభకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చింతకాయల బాబూరావు పాల్గొంటారన్నారు. ప్రజలు ఈ సభలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకుడు ఉల్లింకల బాలకృష్ణ, గోపాల వెంకట్రావు, కండెల్లి రమేష్‌బాబు, చింతల పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



వెంకట్రామన్నగూడెంలో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ పోలిమోనునాగ అంజూష

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని వెంకట్రామన్నగూడెం, బంగారుగూడెం సచివాలయాల వద్ద బుధవారం ప్రభుత్వ చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. తొలుత చలివేంద్రాలను గ్రామ సర్పంచ్ పోలిమోను నాగఅంజూష, వైఎస్సార్‌సీపీ నాయకుడు చంద్రు శ్రీనుబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సచివాలయాలకు వివిధ పనులపై వచ్చే ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఉపకరిస్తాయన్నారు. ఈ కార్యక్రమాల్లో విద్యాకమిటి చైర్మన్ నీలపాల రమేష్, వైస్‌ప్రెసిడెంట్ రాపాక కొండమ్మ, గ్రామ కమిటి అధ్యక్షుడు ములకాల చినశ్రీను, బొట్టా నాగరాజు, బండారు నాగేశ్వరరావు, బంగారుగూడెంలో ముప్పిడి వెంకట్రామిరెడ్డి, మాకిరెడ్డి వెంకటేష్‌రెడ్డి, సేవాదళ్ చైర్మన్ కొండుబోయిన కృపావరం, కె.ఏసుటోని, సమయమంతుల సుబ్రహ్మణ్యం, వేముల వెంకన్న, సమయమంతుల సత్యనారాయణ, మిండెల్లి రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి బి.ఫణీంద్రకుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శుభ్రతతో వ్యాధులు దూరం



గోటేరులో బ్రోచర్లు చూపిస్తున్న వైద్య సిబ్బంది, తదితరులు

ఇరగవరం: పరిసరాలు పరిశుభ్రతతో వ్యాధులు దూరమవుతాయని సబ్ యూనిట్ అధికారి జి.వెంకటేశ్వరరావు, పీహెచ్‌సీ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శ్రీరామరాజు అన్నారు. బుధవారం ఇరగవరం మండలంలోని పలు గ్రామాల్లో దోమపుట్టుకకు అవకాశం ఉన్న ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ దోమ పుట్టుకకు అవకాశం ఉన్న నీటి నిల్వలు, పనికి రాని సామాగ్రి ఉంటే వాటిని తొలగించాలన్నారు. అనంతరం వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌ను విజిట్ చేసి ఓపీకు వస్తున్న ఫీవర్ కేసుల డేటాను అడిగి తెలుసుకుని సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జుత్తిగ గాయత్రిదేవి, గ్రామ సచివాలయ కన్వీనర్ గణేష్‌కుమార్, ఆరోగ్య సిబ్బంది కె.ఇంద్రాణి, హెల్త్ అసిస్టెంట్ అప్పారావు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



తణుకు ప్రైవేటు ఆసుపత్రిలో అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది



అత్తిలి పీహెచ్‌సీ వద్ద అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ ఆఫీసర్

తణుకు: ఆసుపత్రుల్లో అగ్ని ప్రమాదాల నివారణపై సిబ్బంది అవగాహన కలిగి ఉండాలని తణుకు అగ్నిమాపక అధికారి ఐ.అజయ్‌కుమార్ కోరారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా బుధవారం తణుకులోని ప్రైవేటు ఆసుపత్రుల్లో అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలు జరిగిన సమయంలో తీసుకోవాల్సిన చర్యలతోపాటు మంటలను ఆర్పే విధానంపై సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పట్టణంలోని పలు ప్రధాన కూడళ్లలో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది, ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

అత్తిలి: అగ్నిప్రమాదాలు సంభవించిన సమయంలో సమయస్ఫూర్తిని ప్రదర్శించడం ద్వారా ప్రమాద తీవ్రతను తగ్గించవచ్చని అగ్నిమాపక అధికారి సీహెచ్ రాజంరాజు చెప్పారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా బుధవారం అత్తిలి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వద్ద అగ్నిప్రమాదాలు– నివారణా చర్యలు, ఫస్ట్ ఎయిడ్, ఫైర్ ఫైటింగ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆసుపత్రిలో అగ్నిప్రమాదాలు సంభవించిన సమయంలో బాధితులను సురక్షిత ప్రదేశానికి ఏవిధంగా తరలించాలో, రోగి రవాణా చేయుపద్ధతులను చేసి చూపించారు.ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం (టీఓసీ): అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా బుధవారం అగ్నిమాపక అధికారి గణేశ్న వెంకట రామారావు ఆధ్వర్యంలో మథర్ వన్నిని ఆసుపత్రిలో అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. కరపత్రాలు పంపిణీ చేశారు.

బైర్రాజు ఫౌండేషన్ సేవలు వినియోగించుకోవాలి



కొత్తపాడు గ్రామంలో మాట్లాడుతున్న వైద్య సిబ్బంది

ఇరగవరం: గ్రామీణప్రాంత మహిళల ఆర్థిక స్వాలంబనకు బైర్రాజు ఫౌండేషన్ అందిస్తున్న సేవలు వినియోగించుకోవాలని కొత్తపాడు సొసైటీ అధ్యక్షుడు పెన్మత్స రామభద్రరాజు తెలిపారు. మూడు రోజుల పాటు ఉచిత బీపీ, షుగర్ టెస్టులు చేసి మందులు పంపిణీ చేస్తామన్నారు. జీవనోపాదుల విభాగం ఆధ్వర్యంలో మహిళలకు కుట్లు, ఇతర ఉపాధి శిక్షణ తరగతుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

బేసిక్‌స్కూల్లో 400 మందికి కంటి పరీక్షలు

పెంటపాడు: మండలంలోని ప్రభుత్వ బేసిక్ పాఠశాలలో బుధవారం విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా 400 మందికి ఉచితంగా వైద్యపరీక్షలు చేయడంతో పాటు, దృష్టిలోపాలు ఉన్న 100 మందికి కళ్లజోళ్లు పంపిణీ చేశారు. నిడదవోలు రాజేశ్వరి లయన్స్ నేత్రవైద్యులు ఈ పరీక్షలు చేశారు. గ్రామానికి చెందిన మాదాసు సత్యవెంకటరమణమూర్తి జ్ఞాపకార్థం వారి కుమారుడు వెంకట సత్యనారాయణమూర్తి, లక్ష్మీదంపతులు సౌజన్యంతో ఈపరీక్షలు జరిగినట్లు హెచ్ఎం రాజేష్ తెలిపారు.

23న గురుకుల ప్రవేశ పరీక్ష

తాడేపల్లిగూడెం రూరల్: గురుకుల విద్యాలయలో ఐదవ తరగతి, ఇంటర్మీడియట్ ప్రవేశ పరీక్ష ఈ నెల 23వ తేది ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు జరుగుతుందని పెదతాడేపల్లి డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ గురుకుల విద్యాలయ ప్రిన్సిపల్ బి.రాజారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఐదో తరగతి విద్యార్థులు ౖ ఇజ ఇభి ఎౖ) ఇభిజటట.జీ ఽ, ఇంటర్మీడియట్ విద్యార్థులు ౖ ఇజ ఇభీౖ ఇభిజటట.జీ ౖటి వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

స్మార్ట్‌ఫోన్ వినియోగంపై శిక్షణ

సాక్షి, భీమవరం: మారుతున్న కాలానికి అనుగుణంగా వృద్ధులకు స్మార్ట్‌ఫోన్ ఉపయోగించడం తప్పనిసరిగా మారిందని ఇటువంటి తరుణంలో హెల్ప్‌ఏజ్ ఇండియా సహకారంతో వృద్ధులకు డిజిటల్ సేఫ్టీ ట్రైనింగ్ ఫర్ ఎల్డెర్స్ అనే అంశంపై శిక్షణ ఇవ్వడం ఎంతో ప్రయోజనకరమని సీనియర్ సిటిజన్స్ ఫోరమ్ ఫర్ బెటర్ సొసైటీ భీమవరం ఫోరమ్ అధ్యక్షుడు నల్లం వెంకటకృష్ణ నాగేశ్వరరావు అన్నారు. స్థానిక శ్రీకృష్ణదేవరాయ సాంస్కృతిక సేవాసమితి కల్యాణ మండపంలో బుధవారం ఏర్పాటుచేసిన డిజిటల్ సేఫ్టీ ట్రైనింగ్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనంతరం మాస్టర్ ట్రైనర్ మణిదీప్ స్మార్ట్‌ఫోన్ ద్వారా డిజిటల్ పేమెంట్స్, ఆన్‌లైన్ మనీ ట్రాన్స్‌ఫర్, రైలు టికెట్ బుకింగ్, బ్యాంక్ లావాదేవిల వంటి అంశాలపై వృద్ధులకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హెల్ప్ ఏజ్ ఇండియా కోఆర్డినేటర్ పుష్పాంజలి, ఫోరమ్ ప్రధానకార్యదర్శి బోనం పాండురంగారావు, తాళ్లపూడి గాంధీ, భాస్కర పెద్దిరాజు, నార్కెడిమిల్లి సుందరరావు, కర్రి సోమేశ్వరరావు, యర్రంశెట్టి హరనాథ్ బాబు, కట్రెడ్డి సత్యనారాయణ, రంగరాజు, చినమిల్లి నాయుడు పాల్గొన్నారు.

డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్షా ఫలితాలు విడుదల



తణుకులో మొదటి సెమిస్టర్ పరీక్షా ఫలితాలను విడుదల చేస్తున్న కరస్పాండెంట్ సత్య ఉషారాణి

తణుకు టౌన్: పట్టణంలోని ఎస్‌కెఎస్‌డీ మహిళా అటానమస్ కళాశాల డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్షల్లో మొత్తం 82 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ కరుటూరి రామకృష్ణ తెలిపారు. బుధవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో డిగ్రీ మొదటి సంవత్సరం మొదటి సెమిస్టర్ పరీక్షా ఫలితాలను కళాశాల కరస్పాండెంట్ చిట్టూరి సత్య ఉషారాణి విడుదల చేశారు. ఈ పరీక్షలలో డిగ్రీ మొదటి సంవత్సరం బీఏలో 90 శాతం విద్యార్థినీలు, బీకాం 84 శాతం విద్యార్థినీలు, బిఎస్సీ 71 శాతం విద్యార్థినీలు ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు.